## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

-  రక్షణ, విమానయాన రంగాల్లో దేశం స్వావలంబన సాధిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కి బాత్ కార్యక్రమంలో తెలిపారు.
-  రాష్ట్ర వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగుతోంది.
-  భారత్, ఐర్లాండ్ జట్ల మధ్య చివరి టీ20 క్రికెట్ మ్యాచ్ కొద్ది సేపటి క్రితం ప్రారంభమైంది.
-  ఉపరితల ఆవర్తనం, ద్రోణి ఫలితంగా రాష్ట్రంలో రానున్న రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతిలోని వాతావరణం కేంద్రం తెలిపింది.

====================

రక్షణ, విమానయాన రంగాల్లో స్వావలంబన సాధించే దిశగా భారత్ ఇప్పటికే అనేక మైలురాళ్లను చేరుకుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమైన మన్ కి బాత్ మనసులోని మాట కార్యక్రమం 135వ సంచికలో ప్రధానమంత్రి ఈరోజు పలు విషయాలపై మాట్లాడారు. డీఆర్‌డీఓ దేశీయంగా అభివృద్ధి చేసిన 'లాంగ్ రేంజ్ ల్యాండ్-అటాక్ క్రూయిజ్ మిస్సైల్'ను విజయవంతంగా పరీక్షించిందన్నారు. ఇటీవల నావికాదళంలోకి ప్రవేశించిన మూడు యుద్ధ నౌకలు పూర్తి స్వదేశీ సాంకేతికతో తయారయ్యాయని పేర్కొన్నారు. దేశీయంగా తయారైన తొలి సీ-295 విమానం కార్యకలాపాలు ప్రారంభం, దేశ సాంకేతిక స్వావలంబనకు నిదర్శనమన్నారు. సీ-295 విమానంతో పాటు మరో 40 విమానాలు దేశంలో తయారవుతున్నాయని, దీనివలన దేశీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కూడా బలోపేతం అవుతాయని తెలిపారు. దీనివల్ల వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, 'ఆత్మనిర్భర్ భారత్' సంకల్పం మరింత బలపడుతుందని ప్రధానమంత్రి స్పష్టం చేస్తూ...

(వాయిస్…29 సెకన్లు)

====================

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో తన పిలుపు మేరకు పొదుపు చర్యలు పాటించిన దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ధన్యవాదాలు తెలిపారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమైన మన్ కి బాత్ మనసులోని మాట కార్యక్రమం 135వ సంచికలో ప్రధానమంత్రి మాట్లాడుతూ.. బంగారం కొనుగోళ్లను తగ్గించడంతో పాటు ఇతర పొదుపు చర్యలను ప్రజలు చేపట్టారని అన్నారు. ప్రపంచస్థాయి సంక్షోభాన్ని భారతీయులు కలిసికట్టుగా ఎదుర్కొంటున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. వర్షపు నీటిని పొదుపు చేయాలనే సంకల్పంతో 'క్యాచ్ ద రెయిన్' ఉద్యమాన్ని మరింత ఉధృతంగా ముందుకు తీసుకెళ్లాలని నరేంద్రమోదీ కోరారు. రానున్న గణేశ్ చతుర్థి ఉత్సవాల కోసం ప్రజలు కేవలం మట్టి వినాయక విగ్రహాలనే (Clay Idols) కొనుగోలు చేయాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (PoP) విగ్రహాలను పూర్తిగా దూరం పెట్టాలని ప్రధానమంత్రి సూచిస్తూ...

(వాయిస్…33 సెకన్లు)

====================

రాష్ట్ర వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిన్నారులకు ఈరోజు పోలియో చుక్కలు వేశారు. జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్

పోలియో కార్యక్రమంలో భాగంగా అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల టీకాలను నిర్ణీత సమయానికి వేయించాలని తల్లిదండ్రులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పల్స్ పోలియో కార్యక్రమం అమలుకు చేసిన ఏర్పాట్లను కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో నేటి నుంచి మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం ద్వారా 5 ఏళ్ళ లోపు వయసున్న సుమారు 49 లక్షల 20వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు.

====================

విరామం

====================

రాష్ట్రంలోని తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని అధిగమించేందుకు చొరవ తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి లేఖ రాశారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ స్కీం- PDPS అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ పరిణామాలతో మ్యాంగో పల్ప్ ఎగుమతులు నిలిచిపోవడం, పరిశ్రమలు కొనుగోళ్లు నిలిపివేయడంతో మార్కెట్‌లో తోతాపురి ధరలు పడిపోయాయని లేఖలో పేర్కొన్నారు. మామిడి రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 281 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి ఆ లేఖలో కోరారు.

====================

అనంతపురంలోని ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరుకానున్నారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి S.A కోరి ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ జులై 1వ తేదీన నిర్వహించే విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పాల్గొంటారని అన్నారు. ''జాతీయ విద్యా విధానం మార్గదర్శకాలను'' వంద శాతం అమలు చేసిన తొలి విశ్వవిద్యాలయంగా గుర్తింపు వచ్చిందని తెలిపారు. స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ పాల్గొంటారని, 12 వందల మందికి పైగా విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేయనున్నారని తెలియజేశారు.

====================

మాజీ ప్రధానమంత్రి, దివంగత పీవీ నరసింహారావు 105వ జయంతి సందర్భంగా పలువురు నివాళి అర్పించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నివాళి అర్పించారు. దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించి, దూరదృష్టితో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు. రాజనీతిజ్ఞుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుగాంచిన పీవీ నరసింహారావు తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

====================

దేశంలో ఏ ఒక్కరూ పోలియో బారిన పడకుండా ఆరోగ్యకరమైన జీవనం సాగించడానికి పల్స్ పోలియో కార్యక్రమం దోహద పడుతోందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. ఈరోజు సాలూరు పట్టణంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి, ప్రభుత్వ కార్యక్రమానికి సహకారం అందించాలని కోరారు.

====================

భారత్, ఐర్లాండ్ జట్ల మధ్య చివరి టీ20 క్రికెట్ మ్యాచ్ కొద్ది సేపటి క్రితం ప్రారంభమైంది. ఐర్లాండ్ లోని బెల్ఫాస్ట్ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన భారత్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన ఐర్లాండ్ జట్టు ఒక ఓవర్ లో 13పరుగులు చేసింది.
శుక్రవారం జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో ఐర్లాండ్ జట్టు 34 పరుగుల తేడాతో విజయం సాధించి, సిరీస్‌లో 1-0తో ముందంజలో నిలిచింది.

=====================

ఉపరితల ఆవర్తనం, ద్రోణి ఫలితంగా రాష్ట్రంలో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో రానున్న రెండు రోజులు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని వాతావరణం కేంద్రం తెలిపింది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని, ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి  లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముందని తెలిపారు.

=====================
=====================